పదిలో అద్భుత ఫలితాలకు పక్కా ప్రణాళిక

- సబ్జెక్టుల వారీగా ప్రత్యేక సాధన
- మార్కులొచ్చే అంశాలపైనే దృష్టి


కమలాపురం గర్ల్స్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న స్టడీ అవర్స్‌లో పర్యవేక్షిస్తున్న హెచ్‌ఎం

కమలాపురం : టెన్త్ పరీక్షల్లో యాక్షన్‌ప్లాన్‌తో అద్భుత ఫలితాలు తెచ్చేందుకు కృషి చేస్తున్నామని కమలాపురం బాలికల హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎస్.సరస్వతి తెలిపారు. టెన్త్ పరీక్షలు ఈ ఏడాది నుంచి ఆరు పేపర్లకు కుదించారు. గతంలో 7 పేపర్లు ఉండేవి. ఈ ఏడాది నుంచి ఫిజికల్ సైన్స్, బయాలజికల్ సైన్స్ రెండూ కలిపి ఒకే పేపర్ చేయడంతో ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరిగే పరీక్షల్లో ఆరు పేపర్లు మాత్రమే విద్యార్థులు రాయాల్సి ఉంటుంది. ఒక్కో పేపర్‌కు 100 మార్కులు చొప్పున ఆరు పేపర్లకు 600 మార్కులు ఉంటాయి.

యాక్షన్ ప్లాన్ అమలు : డీఈఓ కార్యాలయం విడుదల చేసిన యాక్షన్ ప్లాన్ జనవరి 1వ తేదీ నుంచి అమలు చేస్తున్నామని, దీంతో మంచి ఫలితాలు సాధిస్తున్నామని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 39 ప్రభుత్వ పాఠశాలు, 20 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 1512 మంది బాలురు, 1260 మంది బాలికలు మొత్తం 2772 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాయనున్నారు. పరీక్షలు దగ్గర పడే కొద్దీ విద్యార్థుల్లో టెన్షన్ పెరుగుతూ ఉంది. దీంతో సబ్జెక్ట్ ఉపాధ్యాయులు విద్యార్థులకు దిశా నిర్దేశం చేస్తూ వారిలో టెన్షన్‌ను పోగొట్టి ధైర్యం నింపుతున్నారు.

ముఖ్యపాత్ర పోషిస్తున్న స్టడీ అవర్స్ : టెన్త్ క్లాస్ విద్యార్థులకు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ఏర్పాటు చేసిన స్టడీ అవర్స్ మంచి ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని సబ్జెక్ట్ ఉపాధ్యాయులు చెబుతున్నారు. అలాగే డీఈఓ ఆదేశాలతో యాక్షన్ ప్లాన్‌లో భాగంగా వారంలో ఒక రోజు నైట్ విజన్ పేరుతో టెన్త్ చదివే ప్రతి విద్యార్థి ఇంటికి ఉపాధ్యాయ బృందం వెళ్లి విద్యార్థి ఎలా చదువుతున్నాడో తల్లిదండ్రులతో ఆరా తీస్తున్నారు.

కమలాపురం నియోజకవర్గంలో
పదవ తరగతి విద్యార్థుల వివరాలు :

మండలం	పాఠశాలలు	బాలురు	బాలికలు	మొత్తం
కమలాపురం	14	274	288	562
వల్లూరు	6	172	141	313
చెన్నూరు	8	179	169	348
సీకే దిన్నె	14	527	309	836
పెండ్లిమర్రి	11	205	240	445
వీఎన్‌పల్లె	6	155	113	268
మొత్తం	59	1512	1260	2772

యాక్షన్ ప్లాన్‌తో అధిక ప్రయోజనం


సిలబస్ పూర్తి చేసి జనవరి 1వ తేదీ నుంచి యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నాం. ప్రతి రోజు స్టడీ అవర్స్ నిర్వహించడం, అదే సబ్జెక్టుల్లో మరుసటి రోజు పరీక్షలు నిర్వహించడంతో మంచి ఫలితాలు వస్తున్నాయి. అలాగే రివ్యూ నిర్వహిస్తున్నాం. ఆరు పేపర్లపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం.
-ఎస్.సరస్వతి, హెచ్‌ఎం, గర్ల్స్ హైస్కూల్, కమలాపురం

విద్యార్థులను గ్రేడ్‌లుగా విభజించి బోధించాను


విద్యార్థులను ఏ,బీ,సీ గ్రేడ్‌లుగా విభజించాను. ఏ గ్రేడ్‌కు అధిక మార్కులు సాధించేలా అన్ని చాప్టర్లలో ప్రాబ్లమ్స్ నేర్పించాను. బి గ్రేడ్ విద్యార్థులకు కేవలం ఇంపార్టెంట్ సమస్యలు మాత్రమే ప్రాక్టీస్ చేయించాను. సి గేడ్ విద్యార్థులకు ప్రతి పేపర్‌లో మూడు చాప్టర్ల చొప్పున మాత్రమే బోధించాను. దీంతో అధిక మార్కుల సాధించే అవకాశం ఉంది.
-వరకుమారి, గణిత ఉపాధ్యాయురాలు, కమలాపురం

స్టడీ అవర్స్‌తో ప్రయోజనం


స్టడీ అవర్స్‌తో చాలా ప్రయోజనం ఉంది. పాఠాలు వినేటప్పటి కంటే స్టడీ అవర్స్‌లో చదువుతుండగానే ఎక్కువ డౌట్లు వస్తుంటాయి. వాటిని అప్పుడే మా ఉపాధ్యాయులు క్లియర్ చేస్తుంటారు. దీంతో చాలా ప్రయోజనం ఉంది.
-సి. శివ కవిత, టెన్త్ విద్యార్థిని, కమలాపురం

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

కమలాపురం : ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయముల సంస్థ తాడేపల్లి ఆధ్వర్యంలో కమలాపురం గురుకుల పాఠశాల నందు 5వ తరగతి, ఇంటర్ ఫస్టియర్(ఇంగ్లీష్ మీడియం) ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ తులశమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల్లో విద్యార్థినులను ప్రవేశ పరీక్షల ద్వారా ఎంపిక చేస్తామన్నారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులను మార్చి 24వ తేదీలోపు నెట్ సెంటర్ ద్వారా గాని, సమీపంలోని గురుకుల పాఠశాలల నుంచి గాని ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 5వ తరగతి విద్యార్థినులకు ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 23వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్ ఫస్టియర్ విద్యార్థినులకు అదే రోజు మధ్యాహ్నం 2గం. నుంచి 4.30 గంటల వరకు ఉంటుందని, ఆసక్తి గల విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె అందులో తెలిపారు.

జూదరుల అరెస్ట్

చింతకొమ్మదిన్నె : కొప్పర్తి సమీపంలోని జగనన్న కాలనీ వద్ద ఆదివారం జూదమాడుతున్న 8 మందిని అరెస్ట్ చేసి వారివద్ద నుంచి రూ.24,250 నగదును స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించినట్లు సీకే దిన్నె ఎస్‌ఐ బి.అరుణ్‌రెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

అంత్యక్రియలకు ఆర్థికసాయం

చెన్నూరు : స్థానిక పాత దళితవాడ 1వ వార్డులోని తూపల్లె పుల్లయ్య(80) అనారోగ్యంతో ఆదివారం మరణించారు. ఈ విషయాన్ని మండల కో ఆప్షన్ సభ్యులు వారిస్ వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుమ్మా రాజేంద్రప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకుపోగా ఆయన ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డికి చెందిన పోచిమరెడ్డి ఛారిటబుల్ ట్రస్టు ద్వారా మృతుని అంత్యక్రియలకు రూ.5 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జీఎస్ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని అచ్చివెల్లి గ్రామ సమీపంలో ఉన్న అచ్చివెల్లి గంగమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు తీర్చేందుకు కడప, అనంతపురం, కర్నూల్ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. అర్చకులు అమ్మవారి తీర్థ ప్రసాదాలను భక్తులు అందజేశారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

లింగాల : స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం 1984–85 సంవత్సరం 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సమావేశం నిర్వహించారు. 37 ఎళ్ల తర్వాత కలుసుకున్నందుకు ఆనందంగా ఉందని అప్యాయంగా పలకరించుకున్నారు. అప్పటి ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు.

శివాలయ నిర్మాణానికి దాతలు సహకరించండి


బ్రాహ్మణపల్లెలో నిర్మాణంలో ఉన్న శివాలయం

పులివెందుల రూరల్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న కైలాసగిరి శివాలయం నిర్మాణానికి దాతలు సహకరించాలని ఆలయ నిర్వాహకులు ప్రసాదుస్వామి కోరుతున్నారు. ఆలయ నిర్మాణాలు చేపట్టి రెండు సంవత్సరాలు అవుతుందని నిధులు లేక పనులు ఆగిపోయాయన్నారు. ఆలయ నిర్మాణ పనులు 75 శాతం పూర్తైయ్యాయని మిగిలిన పనులు పూర్తి చేసేందుకు దాతలు ముందుకు రావాలని కోరుతున్నారు.

ఘనంగా వర్ధంతి


అంకిరెడ్డి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాగేళ్ల సాంబశివారెడ్డి

వేముల : మండల పరిషత్ మొట్ట మొదటి అధ్యక్షుడిగా పనిచేసిన నాగేళ్ల అంకిరెడ్డి వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని పెర్నపాడు గ్రామంలో నాగెళ్ల అంకిరెడ్డి విగ్రహానికి వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, మండల కన్వీనర్ సత్యప్రభావతమ్మ, ఆపార్టీ యువనేత హర్షవర్ధన్‌రెడ్డిలతో పాటు కుటుంబ సభ్యులు నివాళులు అర్పించారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

వేంపల్లె : ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. స్థానిక శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి శాలలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు వెంకటశేషఫణి, ఆవోపా అధ్యక్షుడు గోవర్ధన్, దాతలు రమేష్ బాబు, నారాయణ, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

600 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

కడప అర్బన్: కడప నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అగాడి వీధి నుంచి బెల్లంమండి వీధికి ఆటోలో అక్రమంగా తరలిస్తున్న ప్రభుత్వ రేషన్ బియ్యంను ఆదివారం ఎస్‌ఐ జయరాముడు తమ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. దండుకు చెందిన వెంకట సుబ్బమ్మ, తన దోసెల అంగడి కోసం ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి తరలిస్తుండగా ఆటోను, 15 బస్తాలు (ఒక్కో బస్తాలో 40 కిలోలు) మొత్తం 600 కిలోలను పట్టుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

పెండింగ్ వేతనాలను చెల్లించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలోని ఆశా కార్యకర్తలకు పెండింగ్ వేతనాలను చెల్లించాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు వేణుగోపాల్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా సమితి సమావేశాన్ని నిర్వహించారు.

రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించండి


పట్టభద్రుల ఓటును అభ్యర్థిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, వరప్రసాద్, తదితరులు

పులివెందుల టౌన్ : మార్చి 13న జరిగే పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించుకుందామని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు పట్టభద్రుల ఓటర్లను అభ్యర్థించారు. ఆదివారం పట్టణంలోని 21వ వార్డు పరిధిలో పట్టభద్రులను కలిసి తమ మొదటి ప్రాధాన్యత ఓటును వెన్నపూస రవీంద్రారెడ్డికి వేసి సన్నిహితులతో వేయించి గెలిపించాలన్నారు. ముందుగా బ్రాహ్మణపల్లె రోడ్డులోని శ్రీసుంకుల పరమేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, కౌన్సిలర్లు కోడి రమణ, పార్నపల్లె కిశోర్, డేనియల్ బాబు, రజియ, కో ఆప్షన్ మెంబర్ రంగనాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లె : ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి గెలుపునకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆదివారం 1వ సచివాలయ పరిధిలోని 3, 6, 7 వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చంద్రఓబులరెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు పట్టభద్రులను అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మిగాయత్రీ, ఎంపీటీసీలు చంద్రశేఖర్, మణిగోపాల్‌రెడ్డి, బాబాషరీఫ్, కో ఆప్షన్ మెంబర్ అసానయ్య, మైనార్టీ ప్రధాన కార్యదర్శి నిస్సార్‌బాషా, ఆలయ కమిటీ చైర్మన్లు వెంకటేషు, రాఘవయ్య, సచివాలయ కనీన్లు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వేముల : ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కోగటం వెంకటబయపురెడ్డి, పీసీబీ డైరెక్టర్ మరకా శివకృష్ణారెడ్డిలు పట్టభద్రులను కోరారు. ఆదివారం మండలంలోని చాగలేరు, ఎస్సీ కాలనీలో వారు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ అర్జున్, ఎంపీటీసీ లక్ష్మిదేవి, నాయకులు, పట్టభద్రులు పాల్గొన్నారు.

పాలిసెట్-2023కి ఉచిత శిక్షణ

కమలాపురం : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2023 పాలిసెట్‌కు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులంతా 2023 పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఏప్రిల్ 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. తమ కళాశాలలోనే గతంలో ఎన్నడూలేని విధంగా ఏప్రిల్ 16వ తేదీ నుంచి అత్యుత్తమ, అసాధారణ ఫ్యాకల్టీతో పాలిసెట్‌కు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. మే 10న పాలిసెట్ ఉంటుందన్నారు. దరఖాస్తు, కోర్సులు, సీట్ల వివరాలు తెలుసుకోవడానికి తమ కళాశాలలోనే హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. తమ కళాశాలలో డీఈసీఈలో 66 సీట్లు, డీఈఈఈలో 66 సీట్లు ఉన్నాయన్నారు. నియోజకవర్గ పరిధిలోని విద్యార్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.400, ఎస్సీ, ఎస్టీలు రూ.200 చెల్లించాల్సి ఉంటుందని ఆయన వివరించారు. పాలిటెక్నిక్ ద్వార నైపుణ్య సామర్థ్యాలు మెరుగుపడి విద్యార్థులందరికి పరిశ్రమల్లో త్వరగా ఉద్యోగాలు లభిస్తాయన్నారు. పూర్తి వివరాలకు తమ కళాశాలలో సంప్రదించాలని ఆయన అన్నారు.

'మటన్, చికెన్ అధిక ధరలకు అమ్మితే ఊరుకోం'


మాంసం ధరలు తగ్గించాలని దుకాణాల యజమానులను హెచ్చరిస్తున్న ప్రజలు

ఎర్రగుంట్ల : పట్టణంలో మటన్, చికెన్ దుకాణాల యజమానులు మటన్, చికెన్‌ను అధిక ధరలకు అమ్మితే ఊరుకోమని పట్టణ ప్రజలు ఆదివారం వారిని హెచ్చరించారు. ఉదయాన్నే మటన్, చికెన్ దుకాణాల వద్దకు పెద్ద సంఖ్యలో ప్రజలు వెళ్లి వారిని ప్రశ్నించారు. ఇతర ప్రాంతాల కంటే ఎర్రగుంట్లలో మటన్, చికెన్ దుకాణాల యజమానులు సిండికేట్‌తో అధిక ధరలతో అమ్మడం చాల దారుణమన్నారు. కిలో మటన్ రూ.700, చికెన్ రూ.150లు ఇతర ప్రాంతాలలో ఉందని కానీ ఎర్రగుంట్లలో మాత్రం మటన్ రూ.800, చికెన్ కిలో రూ.200లు అమ్మడంపై ప్రజలు ప్రశ్నించారు. అధిక ధరలకు అమ్మితే దుకాణాల లైసెన్స్‌లు రద్దు చేయించి, మాంసంపై కిరోసిన్ పోస్తామని ప్రజలు హెచ్చరించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


పులివెందులలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


వీరపునాయునిపల్లె : అమ్మవారికి బోనాలు తీసుకెలుతున్న మహిళలు

పులివెందుల టౌన్ : స్థానిక బ్రాహ్మణపల్లె రోడ్డులోని శ్రీసుంకుల పరమేశ్వరిదేవి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం పంచామృత అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయంలో సకలదేవతా కలశాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శేషయ్య ఆధ్వర్యంలో వేదపండితులు గణపతిహోమం, దుర్గా హోమం, ఇష్టదేవతా హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. గ్రామోత్సవంలో కోలాటం, డప్పువాయిద్యాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి.

వీరపునాయునిపల్లె : మండలంలోని తలపనూరులో గంగమ్మతల్లి ఆలయ 30వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్ రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, ఎంపీటీసీ వెంకటరామిరెడ్డి, సర్పంచ్ వెంకటరామిరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి కానుకల రూపంలో వచ్చిన పట్టు వస్త్రాలకు ఆలయ నిర్వాహకులు వేలంపాట నిర్వహించగా రూ.20వేల ఆదాయం వచ్చిందన్నారు. వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

బండలాగుడు పోటీలు

బండలాగుడు పోటీలను ఉదయం 7 గంటలకు రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డిలు ప్రారంభించారు. కాదర్‌ఖాన్ కొట్టాల్ కడప రూరల్‌కు చెందిన పవన్‌కుమార్ ఎద్దులు మొదటి స్థానం సాధించగా చిన్ననాగిరెడ్డిపల్లెకు చెందిన శంకర్‌రెడ్డి ఎద్దులు రెండవ స్థానం, యల్లనూరు మండలం చిలంకూరుకు చెందిన పుట్లూరు సుదర్శన్ ఎద్దులు మూడవ స్థానం, ప్రొద్దుటూరు మండలం నాగాయపల్లెకు చెందిన మూలె నారాయణరెడ్డి ఎద్దులు నాలుగవ స్థానం సాధించాయి.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

జమ్మలమడుగు రూరల్ : మండల పరిధిలోని ఎస్.ఉప్పలపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో నేటినుంచి విగ్రహాలను ప్రతిష్టించనున్నట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం ఎడ్ల పోటీలు నిర్వహిస్తారన్నారు. మొదటి బహుమతి రూ. 80వేలు, రెండవ బహుమతి రూ.70, వేలు, 3వ బహుమతి రూ.60 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. జబర్దస్త్ సినీ ఆర్టిస్ట్ మిమిక్రి ఆర్టిస్ట్ శివారెడ్డి హాజరవుతున్నట్లు వారు తెలిపారు.

రేపు రహెబోతు వార్షికోత్సవం

కమలాపురం : పట్టణంలోని రైల్వే గేటు సమీపంలో ఉన్న రహెబోతు ప్రార్థనా మందిరం 20వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం వైభవంగా నిర్వహిస్తున్నట్లు మందిర దైవ సేవకులు, సంఘ పెద్దలు, విశ్వాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వార్షికోత్సవానికి న్యూఢిల్లీకి చెందిన దైవ సేవకులు జేసీ రావ్ ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేస్తున్నారని వారు తెలిపారు. విశ్వాసులందరూ హాజరై దైవ వాక్యం విని దైవాశీస్సులు పొందాలని వారు కోరారు.

రుణాన్ని సకాలంలో చెల్లించాలి

వేంపల్లె : శ్రీలక్ష్మి నరసింహా, టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీలో సభ్యులు తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లించాలని ఆ సొసైటీ అధ్యక్షుడు సింగారెడ్డి నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌రెడ్డిలు తెలిపారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కమిటీ సభ్యులతో సర్వసభ్య సమావేశం నిర్వహించి మాట్లాడారు. సభ్యులందరికీ స్థలాలు ఏర్పాటు చేయుటకు సొసైటీ ప్రయత్నిస్తోందన్నారు. సందిపల్లె గ్రామం వద్ద సభ్యులకు కేటాయించిన స్థలాలకు సంబంధించి కోర్టు పరిధిలో ఉందని.. వారి పరిస్కారానికి సొసైటీ అన్ని విధాలా ప్రయత్నిస్తుందన్నారు. సకాలంలో రుణాలు చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేడు బండలాగుడు పోటీలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని తాడిగొట్ల సమీపంలోని చిన్నపల్లె యోగి శ్రీ నరసింహాస్వామి 215వ ఆరాధన సందర్భంగా బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త గోసుల మునిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 27న సోమవారం ఉదయం పూజ కార్యక్రమాలు మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు. అనంతరం బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో గెలుపొందిన ఎడ్లకు మొదటి బహుమతి రూ.50 వేలు, రెండవ బహుమతి రూ.40 వేలు, మూడవ బహుమతి రూ.30 వేలు, నాల్గవ బహుమతి రూ.20 వేలు, ఐదవ బహుమతి రూ.15 వేలు, ఆరవ బహుమతి రూ.10 వేలు అందజేస్తామన్నారు.

ఆలయాల నిర్మాణానికి భూమి పూజ


ఆలయ నిర్మాణాలకు భూమి పూజ చేస్తున్న వైఎస్ భాస్కర్‌రెడ్డి

లింగాల : లోపట్నూతల గ్రామంలో ఆదివారం పులివెందుల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వైఎస్ భాస్కర్ రెడ్డి స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు నాగభూషణ్‌రెడ్డి ఆధ్వర్యంలో మాలే గంగమ్మ, పోలేరమ్మ ఆలయాల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. లింగాల కేంద్రంలో పాడా నిధులతో నిర్మించిన స్మశాన వాటిక, ప్రహరి గోడలను, అలాగే జడలయ్యమఠం వద్ద నిర్వహించిన అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. స్థానిక పాఠశాల విద్యార్థులు విజ్ఞప్తి మెరకు జడలయ్యమఠం ఆవరణలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మండలంలోని వైఎస్సార్ సీపీ కన్వీనర్ సుబ్బారెడ్డి, మండల నాయకుడు బాబురెడ్డి, యూత్ కన్వీనర్ మనోహర రెడ్డి, కడప పార్లమెంట్ కన్వీనర్ సారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మండల వ్యవసాయ మండలి చైర్మన్ రమేష్‌కుమార్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, శివారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, నాగభూషణ్‌రెడ్డి, సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హుసేన్ పీరా కుటుంబానికి అండగా ఉంటాం

స్థానిక బీసీ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త హుసేన్ పీరా (30) అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న వైఎస్ భాస్కర్‌రెడ్డి ఆదివారం ఆయన ఇంటికి వెళ్లి మృతదేహం వద్ద నివాళులు అర్పించారు. హుసేన్‌పీరా మృతి బాధాకరమన్నారు. ఆయన కుంటుంబానికి అండగా ఉంటామని కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు కడప పార్లమెంటరీ కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, యూత్ నాయకుడు మనోహరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆశల పంట


పెద్దపసుపుల గ్రామంలో మిర్చిని ఆరబోసిన దృశ్యం

పెద్దముడియం : ఆశల పంటగా పిలుచుకునే మిర్చి కోతలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మండలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా దాదాపు 500 ఎకరాలలో పంట సాగు చేశారు. ఎండు మిర్చి ప్రస్తుతం కిలో రూ.200 నుంచి రూ.250 వరకు ఉంది. ప్రస్తుతం కోతలు జోరుగా సాగుతుండటంతో బయటి ప్రదేశాల్లో పంటను ఆరబెట్టుకుంటున్నారు. ఎకరాకు 10 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వస్తోందని అన్నదాతలు తెలుపుతున్నారు. ఎకరాకు గరిష్టంగా లక్షన్నర రూపాయలు పెట్టుబడులు అయ్యాయని తెలిపారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీఓ జి.శ్రీనివాసులు

జమ్మలమడుగు రూరల్ : స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ జి.శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం పట్టణంలోని బాలాజీ హైస్కూల్ ఆవరణలో ఏర్పాటుచేసిన మేగా వైద్య శిబిరాన్ని ఆయన జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.బాబాఫకృద్దీన్, డీఎస్పీ నాగరాజులతో కలసి ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో 600 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మెరుగైన వైద్యం కోసం 25 మందిని ఆరోగ్య శ్రీ ద్వారా కర్నూల్‌లోని కిమ్స్ ఆసుపత్రికి రెఫర్ చేసినట్లు నిర్వాహకులు బైరెడ్డి లక్ష్మిరెడ్డి, హైకోర్టు న్యాయవాది తెలిపారు. కార్యక్రమంలో బాలాజీ విద్యా సంస్థల డైరక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణ విద్య అందరికీ అవసరమే

కడప కార్పొరేషన్: ప్రస్తుత సమాజంలో ఆత్మ రక్షణ విద్యలు బాలబాలికలకు అవసరమని 50వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కె. రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయిపేట హైస్కూల్‌లో కరాటే నందు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించిన విద్యార్థులను వారు అభినందించి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తాము నేర్చుకున్న విద్యలో నైపుణ్యత సాధించాలని, తద్వారా తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తేవాలని కోరారు.

ఘనంగా గంగమ్మ జాతర వేడుకలు


ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి


పోతురాజు వద్ద పూజలు చేస్తున్న భక్తులు


ఎడ్ల బండిని అలకరించిన భక్తులు

చింతకొమ్మదిన్నె : మండలంలోని బుగ్గలేటిపల్లె–కొత్తపేట సరిహద్దులోని గంగమ్మ ఆలయం ఆదివారం జనసంద్రంగా మారింది. జాతర ముగిసిన తర్వాత వచ్చే నాలుగు వారాల్లో భాగంగా మొదటి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే ఆలయ ఆవరణలోని వీరభద్రస్వామి, సాయిబాబా, ఆంజనేయస్వాములను భక్తులు దర్శించుకున్నారు. అనంతరం బంధుమిత్రులతో కలిసి విందు భోజనాలు చేశారు. భక్తులకు ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ బి.అరుణ్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.